


దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 62 | సోమవారం 03-03-2025 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..



## కేటీఆర్‌కు అహంకారం.. కిషన్‌రెడ్డికి కుళ్లు

- ఆయన కన్నా జూనియర్‌గా ఉన్న నేను ఎదిగానని అసూయ
- రాష్ట్రానికి మంచి చేయాలని మోదీకి ఉన్నా.. కిషన్‌రెడ్డి సైంధవుడిలా అడ్డుపడుతున్నారు
- ఏదైనా వస్తే తన ఖాతాలో వేసుకుంటున్నారు - రాకపోతే రేవంత్ ఏం చేయలేదంటున్నారు
- ఎయిర్‌పోర్టు తెచ్చింది ఆయనే ఐతే.. మూసీ, ఆర్‌ఆర్‌ఆర్, మెట్రోలను అడ్డుకున్నదెవరు?

**వనపర్తి బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి - ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి, రేవంతన్న భరోసా పథకాలు ప్రారంభం**

**మహబూబ్‌నగర్, మార్చి 2:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై మరోసారి విమర్శలతో విరుచుకుపడ్డారు. కేంద్రం నుంచి నిధులు రాకుండా కిషన్‌రెడ్డి సైంధవ పాత్ర పోషిస్తున్నారని, నిత్యం అసూయతో రగిలిపోతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్‌కు అహంకారం ఉంటే.. కిషన్‌రెడ్డికి కుళ్లు ఉందని అన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలో పర్యటించిన ముఖ్యమంత్రి రూ.879.80 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన ప్రజాపాలన బహిరంగ సభలో మాట్లాడారు. రాష్ట్రానికి నిధులిచ్చి మంచి చేయాలని ప్రధాని మోదీ చూస్తున్నా.. కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారని తెలిపారు. తాము కేంద్ర మంత్రుల వద్దకు, ప్రధాన మంత్రి వద్దకు పలుమార్లు వెళ్లి ఏదైనా సాధిస్తే.. కిషన్‌రెడ్డి తానే తెచ్చానంటూ ఖాతాలో వేసుకుంటున్నారని విమర్శించారు. వస్తే తన ఖాతాలోకి, రాకపోతే రేవంత్‌రెడ్డిఏమీ చేయడంలేదని ఆరోపించడం ఆయనకు అలవాటుగా మారిందన్నారు. "నేను కష్టపడి మామునూరు ఎయిర్‌పోర్టుకు అనుమతులు తెస్తే.. తానే తెచ్చానని కిషన్‌రెడ్డి చెప్పుకుంటున్నారు. అలా అయితే మూసీ ప్రక్షాళనకు, మెట్రో విస్తరణకు, ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర, దక్షిణ భాగాల పనులకు, పాలమూరు-రంగారెడ్డికి నీటి కేటాయింపులు, కాళేశ్వరానికి కేటాయింపులు, సమ్మక్క-సారక్క, సీతారామ సాగర్‌లకు నిధులు రాకుండా అడ్డుపడుతున్నది ఆయనేనని భావించాల్సి వస్తుంది" అని రేవంత్ అన్నారు. తాను కిషన్‌రెడ్డి ఒక సందర్భంలో కలిసి పనిచేశామని, ఆయన కంటే చిన్నవాడిని, జూనియర్‌ను అయిన తాను ఎదగడం ఓర్వలేక అసూయతో రగిలిపోతున్నారని ఆరోపించారు. తాను ఈ 14 నెలల కాలంలో 55,163 మందికి ఉద్యోగాలు ఇచ్చానని, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోదీ 12 ఏళ్లలో 24 కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణలో కేవలం కిషన్‌రెడ్డికి, బండి సంజయ్‌కు మాత్రమే ఉద్యోగాలు వచ్చాయన్నారు. వీరిద్దరు కేంద్రం నుంచి చిల్లిగవ్వ తేలేదన్నారు. హైదరాబాద్ అభివృద్ధిపై సమీక్ష కోసం కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ రాకుండా రెండుసార్లు కిషన్‌రెడ్డి అడ్డుపడ్డారని, ఆయన వస్తే సమీక్షకు రాలేదన్నారు. ఈటల రాజేందర్ వచ్చి మేడ్చల్ వరకు మెట్రోను విస్తరించాలని కోరారని తెలిపారు. కేంద్రం దగ్గర ఉన్న సీబీఐ, ఈడీతో ఎంతకాలం బెదిరిస్తారని ప్రశ్నించారు. చావు ఒక్కసారే వస్తుందని వ్యాఖ్యానించారు. వచ్చే పార్లమెంట్ సమావేశాలకు ముందు కిషన్‌రెడ్డి సమీక్ష పెడితే తెలంగాణ ఎంపీలంతా వచ్చి ప్రతిపాదనలు ఇస్తారని, వాటి ప్రకారం నిధులు మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. కృష్ణానదిలో 811 టీఎంసీల నీటిలో ఏపీకి 512 టీఎంసీల కేటాయింపును సమర్ధిస్తూ కేసీఆర్ పెట్టిన సంతకం తెలంగాణకు యమపాశమైందని అన్నారు. ఆనాడు పోతిరెడ్డిపాడు పొక్క పెంచుకోవడానికి తండ్రి వైఎస్ఆర్‌కు, స్వరాష్ట్రం ఏర్పడ్డాక రాయలసీమ లిఫ్టుకు పునాది వేసి కొడుకు జగన్‌కు కేసీఆర్ సాయం చేశారని ఆరోపించారు. పదేళ్లలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేసిన కేసీఆర్.. కాంగ్రెస్ హయాంలో 32 కిమీలు పూర్తయిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను వదిలేశారని మండిపడ్డారు. రోజా ఇంటికి వెళ్లి రొయ్యల పులుసు తిని.. రాయలసీమను రతనాల సీమ చేస్తానని చెప్పి లిఫ్టుకు కర్త, కర్మ, క్రియగా మారారని ధ్వజమెత్తారు. పాలమూరు బిడ్డ సీఎం అయితే ఓర్వలేక ఏడాది కాకముందే దిగిపోవాలంటున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం చేస్తున్న, చేసిన పనులను బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు మనఃసాక్షితో చూడాలని సీఎం రేవంత్ అన్నారు. 25.50 లక్షల మందికి రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామని, కేసీఆర్ ఎగవేసిన రైతుబంధు సాయం రూ.7,627 కోట్లు ఇచ్చామని, కోతలు లేకుండా విద్యుత్తు అందిస్తున్నామని చెప్పారు. అలాగే 50 లక్షల మందికి 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు ఇస్తున్నామని వివరించారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీ సబ్‌ప్లాన్, బీసీ కార్పొరేషన్, ట్రైబల్ కార్పొరేషన్, మైనారిటీ కార్పొరేషన్‌లను పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా వివిధ కార్పొరేషన్ల కింద స్వయం ఉపాధి పథకాలకు రూ.6 వేల కోట్లు అందజేస్తామని చెప్పారు. కేటీఆర్, హరీశ్‌రావు సంస్కారహీనంగా మాట్లాడుతున్నారని, గడీని దాటి బయటకు రాలేని కేసీఆర్ వీరిద్దరితో మాట్లాడిస్తున్నారని భట్టివిక్రమార్క మండిపడ్డారు. రెండో విడత రైతు భరోసా మార్చి 31లోపు జమ చేస్తామని అన్నారు. కాగా, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పదేళ్లు నిర్లక్ష్యం చేసి.. అనుకోని ప్రమాదం జరిగితే బీఆర్ఎస్ నేతలు ఇంగితజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వనపర్తి అర్బన్: ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి, రేవంతన్న భరోసా పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 50మంది ముస్లింమహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ పథకం కింద రాష్ట్రంలో రూ.36.64 కోట్లతో 42 వేల 230 మందికి మైనారిటీ మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. వనపర్తి పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి తాను చదువుకునే రోజుల్లో అద్దెకు ఉన్న ఇంటికి వెళ్లారు. ఆ కుటుంబం ఎంతో ఆప్యాయంగా హారతులిచ్చి రేవంత్‌ను ఆహ్వానించింది. ఈ సందర్భంగా అప్పట్లో ఆ కుటుంబ సభ్యులతో తనకున్న అనుబంధాన్ని రేవంత్ గుర్తు చేసుకున్నారు. వారు చేసిపెట్టిన పూరీలు తింటూ వారితో సరదాగా గడిపారు. వారితో ఫొటోలు దిగారు. 'ఇది రక్త సంబంధం కాదు.. అంతకంటే ఎక్కువైన అనుబంధం. వనపర్తిలో విద్యాభ్యాసం చేస్తూ ఆనాడు అక్క ఇంట్లో ఆత్మీయతను ఆస్వాదిస్తూ పెరిగా. ఆ జ్ఞాపకాలను మోసుకుని ముఖ్యమంత్రిగా అక్క ఇంటికి వెళ్లా' అంటూ తన 'ఎక్స్' ఖాతాలో సీఎం రేవంత్ పోస్టు చేశారు. మరోవైపు వనపర్తిలో తనతో కలిసి చదువుకున్న స్నేహితులతోనూ రేవంత్ కొద్దిసేపు గడిపారు. గత స్మృతులను నెమరువేసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు.

## డూప్లికేట్ ఎపిక్ నంబర్లు ఉంటే.. నకిలీ ఓటర్లు ఉన్నట్లు కాదు!

**వేర్వేరు రాష్ట్రాల్లో ఒకే విధమైన సంఖ్యలు కొన్ని ఉండొచ్చు.. మమత ఆరోపణలపై ఈసీ**

**ఇకపై యూనిక్ నంబర్లు ఇస్తామని వెల్లడి**



**న్యూఢిల్లీ, మార్చి 2:** బెంగాల్ ఓటర్ల జాబితాల్లో హరియాణా, గుజరాత్‌లకు చెందిన నకిలీ ఓటర్లను బీజేపీ చేర్చుతోందని.. ఇందుకు ఎన్నికల కమిషన్ (ఈసీ) సహకరిస్తోందని ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ చేసిన ఆరోపణలపై ఈసీ స్పందించింది. ఓటరు కార్డు(ఎపిక్) నంబర్లు ఒకేలా ఉన్నంత మాత్రాన నకిలీ లేదా డూప్లికేట్ ఓటర్లు ఉన్నట్లు కాదని ఆదివారం స్పష్టం చేసింది. మమత పేరు ప్రస్తావించకుండా.. రెండు రాష్ట్రాల ఓటర్లకు ఒకేరకమైన ఎపిక్ నంబర్లు ఉన్నాయంటూ మీడియాలో వచ్చిన కథనాలు, సోషల్ మీడియా పోస్టులను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపింది. 'కొందరు ఓటర్ల ఎపిక్ నంబర్లు ఒకే విధంగా ఉన్నా.. రాష్ట్రాలు, అసెంబ్లీ నియోజకవర్గాలు, పోలింగ్ కేంద్రాలు వేర్వేరుగా ఉంటాయి. ఎపిక్ నంబర్‌తో సంబంధం లేకుండా.. తమ సొంత రాష్ట్రం/కేంద్ర పాలిత ప్రాంతంలోని నియోజకవర్గంలో, పోలింగ్ కేంద్రంలో ఓట్లు నమోదుచేసుకున్న ఏ ఓటరైనా ఓటేయవచ్చు' అని తేల్చిచెప్పింది. ఈసీకి సంబంధించిన ఎలక్టోరల్ రోల్ మేనేజ్‌మెంట్ (ఎరోనెట్) ప్లాట్‌ఫాంకు ఓటర్ల సమాచారం పంపేముందు రెండు విభిన్న రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలు ఒకేవిధమైన అల్ఫాన్యూమరిక్ సిరీసను ఉపయోగించడం వల్ల తాజా సమస్య తలెత్తినట్లు గుర్తించింది. ఈ నేపథ్యంలో రిజిస్టర్డ్ ఓటర్లందరికీ ఇకపై యూనిక్ ఎపిక్ నంబర్లు కేటాయించాలని ఈసీ నిర్ణయించింది. ఈ ప్రక్రియకు సహకరించేందుకు ఎరోనెట్ 2.0 ప్లాట్‌ఫాంను ఆధునికీకరిస్తామని తెలిపింది. మమత ఆరోపణలను బెంగాల్ ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) కూడా తోసిపుచ్చారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం.. ఏ రాష్ట్రంలోనైనా ఎన్నికల జాబితాల నవీకరణలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు), రిటర్నింగ్ అధికారులు(ఈఆర్‌వోలు), సహాయ రిటర్నింగ్ అధికారులు(ఏఈఆర్‌వోలు), జిల్లా ఎన్నికల అధికారులు(డీఈవోలు), రాష్ట్రాల సీఈవోలు పాలుపంచుకుంటారని.. రాజకీయ పార్టీలు నియమించిన బూత్ స్థాయి ఏజెంట్లు క్రియాశీల పాత్ర పోషిస్తారని ఆదివారం ఓ ప్రకటనలో గుర్తుచేశారు. ఓటర్ల నమోదు, జాబితాలపై ఏవైనా అభ్యంతరాలుంటే వీరి ముందు ఉంచాలని.. వాటిపై తక్షణమే దృష్టి సారిస్తున్నామని.. దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. కాగా.. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక.. అక్కడ 5 నెలల వ్యవధిలోనే 48 లక్షల మంది కొత్త ఓటర్లను చేర్చారని కాంగ్రెస్ ఆరోపణలు చేస్తోందని.. కానీ ఈ వ్యవహారంలో సీఈవో కార్యాలయానికి ఒక్క ఫిర్యాదు మాత్రమే చేసిందని ఈసీ వర్గాలు తెలిపాయి. మమత చెప్పిన మరో అబద్ధం బట్టబయలైందని బీజేపీ ఐటీ ఇన్‌చార్జి, బెంగాల్ బీజేపీ సహ ఇన్‌చార్జి అమిత్ మాలవీయ 'ఎక్స్'లో పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిపోవడంతో ఆమె దుష్ప్రచారానికి ఒడిగట్టారని, ఎన్నికల వ్యవస్థపై ఓటర్ల విశ్వాసాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారని ఆరోపించారు. బెంగాల్లో ఓటర్ల ప్రక్షాళన జరపాలని ఈసీని కోరారు. అక్రమ బంగ్లాదేశీయులను, రోహింగ్యాలను ఓటర్ల జాబితాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

## బీఎస్పీ నుంచి మాయావతి మేనల్లుడు ఔట్



**లఖ్‌నవూ, మార్చి 2:** బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) అధినేత్రి మాయావతి సంచలన ప్రకటన చేశారు. "తాను బతికున్నంత కాలం వారసులను ప్రకటించబోనని" ఆమె వెల్లడించారు. గతంలో తన రాజకీయ వారసుడిగా ప్రకటించిన మేనల్లుడు ఆకాశ్‌ను పార్టీలో అన్ని బాధ్యతల నుంచి తొలగించారు. అలాగే తన సోదరులు ఆనంద్ కుమార్, రామ్‌జీ గౌతమ్‌లను పార్టీ జాతీయ సమన్వయకర్తలుగా ఆమె నియమించారు. తాజాగా లఖ్‌నవూలో జరిగిన పార్టీ ఉన్నతస్థాయి సమావేశంలో మాయావతి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన కారణంగా ఆకాశ్ మామయ్య అశోక్ సిద్ధార్‌ను పార్టీ నుంచి బహిష్కరించానని ఆమె చెప్పారు. ఆయన ఆకాశ్‌ను కూడా ప్రభావితం చేస్తున్నారని, అందుకే ఆకాశ్‌ను అన్ని బాధ్యతల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు.

## సెబీ మాజీ చీఫ్ మాధవి పురిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయండి

**మరో ముగ్గురు సెబీ డైరెక్టర్లు, బీఎసఈ ఎండీ, సీఈఓపై కూడా..**

**30 రోజుల్లో కేసు స్థాయీ నివేదిక సమర్పించాలి**

**ఏసీబీకి ముంబైలోని ప్రత్యేక కోర్టు ఆదేశం**

**ముంబై, మార్చి 2:** పదవీ విరమణ పొందిన రోజు నుంచే సెబీ మాజీ చీఫ్ మాధవి పురి బుచ్‌కు కొత్త కష్టాలు మొదలయ్యాయి. స్టాక్ మార్కెట్ కుంభకోణానికి సంబంధించిన ఒక కేసులో ఆమెతోపాటు ప్రస్తుతం సెబీ డైరెక్టర్లుగా ఉన్న అశ్వని భాటియా, అనంత్ నారాయణ్ జి, కమలేష్ చంద్ర వర్షణిలపైనా ఎఫ్ఐర్‌లు నమోదు చేయాలని ముంబై వర్లీ ప్రాంతంలోని ఏసీబీ ప్రత్యేక కోర్టు.. ఏసీబీని ఆదేశించింది. వీరితో పాటు బాంబే స్టాక్ ఎక్స్చేంజీ (బీఎసఈ) ఎండీ, సీఈఓ సుందరరామన్ రామమూర్తి, మాజీ చైర్మన్, పబ్లిక్ ఇంట్రెస్ట్ డైరెక్టర్ ప్రమోద్ అగర్వాల్‌పైనా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని ఆదేశించింది. న్యాయమూర్తి శశికాంత్ ఏకనాథ్‌రావు బంగర్ శనివారం ఈ ఆదేశాలు జారీ చేశారు. తమ పర్యవేక్షణలో జరిగే ఈ కేసు దర్యాప్తును నెల రోజుల్లో స్థాయి నివేదిక సమర్పించాలని కూడా ఆదేశించారు. సవన్ శ్రీవాస్తవ అనే జర్నలిస్టు చేసిన ఫిర్యాదు ఆధారంగా ఏసీబీ న్యాయస్థానం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. 1994లో ఒక కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా తన షేర్లను లిస్ట్ చేసి, ఆ తర్వాత పెద్దఎత్తున అక్రమంగా తన షేర్ల ధర పెంచుకుని మదుపరుల నెత్తిన టోపీ పెట్టిందని ఆయన ఆరోపించారు. దీనిపై సెబీకి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదంటూ ఏసీబీ కోర్టులో పిటిషన్ వేశారు. 'ఈ కేసులో నిందితులు నిబంధనలు తుంగలో తొక్కి కుమ్మక్కయ్యారు.

## రంగస్థల కళాకారులకూ అవార్డులు

**భక్తరామదాసు కీర్తనలు మార్గదర్శకం: మల్లు భట్టివిక్రమార్క**



**బర్కత్‌పుర, మార్చి 2:** సినీ కళాకారుల మాదిరిగానే రంగస్థల కళాకారులకూ అవార్డులు ప్రదానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నాటక రంగ పోటీలను నిర్వహించి ఎంపిక చేసి ఈ అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. భక్తరామదాసుకు శ్రీరాముడిపై ఉన్న భక్తి, ఆయన పాడిన కీర్తనలు నేటి తరానికి మార్గదర్శకం అని పేర్కొన్నారు. సంగీత కళాకారులు రామదాసును స్ఫూర్తిగా తీసుకుని ప్రముఖ విద్వాంసులుగా పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు. ఆదివారం ఎల్‌బి ఇండోర్ స్టేడియంలో భక్తరామదాసు 392వ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా భక్తరామదాసు జయంతి వేడుకలను ప్రతియేటా అధికారికంగా నిర్వహించి సంగీత నాట్యకళాకారులను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. భక్తరామదాసు అలియాస్ కంచర్ల గోపన్న పుట్టి పెరిగిన జిల్లాలోనే తాను జన్మించడం ఆనందంగా ఉందని ఆయన చెప్పారు. మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. భక్తరామదాసు గొప్ప వ్యక్తి అని, ఎన్ని కష్టాలు ఎదురైన శ్రీరాముడిపై తనకు ఉన్న భక్తిని చాటిచెప్పి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

## యూపీఎస్‌ను రద్దు చేయకుంటే ఉద్యమమే

- ఏప్రిల్ 1న బ్లాక్ డే, మే 1న చలో ఢిల్లీ
- సెప్టెంబరు 1న సామూహిక సెలవులు
- సీపీఎస్ ఈయూ అధ్యక్షుడు స్థితప్రజ్ఞ




**హైదరాబాద్, కవాడిగూడ, మార్చి 2:** రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యూపీఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యూ పీఎసను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 1న రాష్ట్రవ్యాప్తంగా బ్లాక్ డేగా పాటిస్తామని, ప్రతి జిల్లా నుంచి ప్రధానికి లేఖలు రాస్తామని, మే1న చలో ఢిల్లీ నిర్వహిస్తామని, సెప్టెంబరు 1న సామూహిక సెలవులు పెట్టి లక్ష కలాలతో కవాతు నిర్వహిస్తామని చెప్పారు. ఆదివారం హైదరాబా ద్‌లోని ధర్నాచౌక్‌లో యూపీఎస్ వద్దంటూ 'యుద్ధభేరి' పేరుతో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం దశల వారీగా ఉద్యమాన్ని చేపట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. యూపీఎసను 2025 ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం జనవరి 24న విడుదల చేసిన గెజిట్‌లో పేర్కొన్నదని, దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు.

# ఆదివాసీ దార్మిక పరిషత్ ఏర్పాటుకు "నేను సైతం అన్న మంత్రి సీతక్క"


**-త్వరలో సీఎం రేవంత్ రెడ్డి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క లతో సమాలోచన చేస్తాను అని హామీ ఇచ్చిన మంత్రి సీతక్క**

**కోయ పుణ్యం ధర్మ ప్రచారక్, ఆదివాసి 9 తెగల సమన్వయకర్త చుంచు రామకృష్ణ**



**తొలి సమయం డెస్క్ హైదరాబాద్ మార్చి 2:** ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను, అస్తిత్వాన్ని కాపాడేందుకు నేను సహితం నా జాతి కోసం సహకారం చేస్తాను అని , త్వరలో సిఎం రేవంత్ రెడ్డి, మరియు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుకొనిపోతానని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివాసీ 9తెగల సమన్వయ కర్త చుంచు రామకృష్ణ మంత్రి సీతక్కను హైదరాబాద్ లోని ఆమె స్వగృహంలో కలిసి ఆదివాసీ ధార్మిక పరిషత్ అవసరాన్ని తెలియజేశారు, ఆదివాసీల మనుగడ పై అనేక విషయాలు మంత్రి సీతక్క తో ఏకరువు పెట్టారు. 5వ షెడ్యూల్లో అన్య సంస్కృతులు వ్యాపకాలు ప్రచారాలు, ప్రాచ్యత్త సంస్కృతుల వ్యాపకాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి అని, దాంతో ఆదివాసి సంస్కృతి సంప్రదాయాలను తెలియజేసే ఆదివాసీ ఇలవేల్పుల ప్రకృతి గుళ్ళు ,గుహలు, క్షేత్రాలు కనుమరుగు అవుతున్నాయి అన్నారు. చెడు వ్యాపకాల వైపు ప్రభావితం అవుతున్నారని అన్నారు. అడవుల్లో అమాయక ఆదివాసీల బ్రతుకులు రోజు రోజుకు ప్రశ్నార్థకమై పోతున్నాయి అన్నారు. మసీదుల్లో, చర్చిల్లో , గుళ్ళల్లోని పూజారులకు , ఫాస్టర్లకి, ఇమామ్ లకు ఎండోమెంట్ శాఖ, వక్ఫ్ బోర్డు వారు కనీస జీతభత్యం కింద 10వేల వరకు ఇస్తుందని అన్నారు. అదేవిధంగా ఆదివాసీ 9 తెగల వారు వివిధ ఇలవేల్పులను పూజిస్తారని అన్నారు. పూజారులు, వడ్డెలు , కటోడాలు అడ్డి డోలు కళాకారులు, సాహిత్య కళాకారులకు, తలపతులకు , పటేల్ వ్యవస్థకు గత ప్రభుత్వాల నుండి తగిన సహకారం లేకపోవడం వలన ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలకు సంబంధించిన దేవీ దేవతల గుళ్లను కాపాడటం, జాతరల నిర్వహణకు కష్టం అవుతోంది అని అన్నారు. ఈ దేశ మొలవాసులైన ఆదివాసీల పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం కోసం గత నెలలో రాష్ట్ర గవర్నర్ ను కూడా కలిసాం అన్నారు. గత 5 ఏళ్లుగా కేంద్ర, రాష్ట్ర మంత్రులను కూడా కలిసి వినతి పత్రాలు అందజేయడం జరిగింది అన్నారు. ఆసియా ఖండంలోనే మేడారం సమ్మక్క సారలమ్మ జాతర మరో కుంభమేలాగా ప్రతి రెండేళ్లకోసారి కొనసాగుతున్నదని అన్నారు కనుక వడ్డెలు, పూజారులు, కటోడాలు ,పేరంటాలు,తలపతులకు ,కనీసం ప్రతి నెలా 2000/- రూపాయల గౌరవ వేతనం ఇవ్వాలని, అడ్డి కళాకారులకు, సాహిత్య కళాకారులకు ప్రతి నెలా 5000/- రూపాయల గౌరవ వేతనం ఇవ్వాలని,అనేక ఆదివాసీ ఇంటి ఇలవేల్పుల జాతరలు కూడా దాదాపు 200 వరకు ఈ రాష్ట్రంలో ఉన్నాయి అన్నారు. ఒక్కో జాతర కు కనీసం ఒక లక్ష రూపాయల నిర్వహణ ఖర్చులు ఇవ్వాలని, 5వ షెడ్యూల్ లో ఆదివాసీ తెగల సంస్కృతి సంప్రదాయాల పునరుద్ధరణకు "ఆదివాసీ ధార్మిక పరిషత్ " అనివార్యం అన్నారు. మొదట తెలంగాణ రాష్ట్రంలో అదివాసి ధార్మిక పరిషత్ తొలి అడుగు పడితే జాతీయ స్థాయి లో మిగిలిన రాష్ట్రాలకు రోల్ మోడల్ అవుతుంది అని, ఫలితంగా జాతీయ ఆదివాసీ ధార్మిక పరిషత్ ఏర్పాటుకు దారి సుగమం అవుతుంది అన్నారు. దీనిపై వెంటనే స్పందించిన సీతక్క మాట్లాడుతూ.. గత కొద్దికాలం నుండి కోయ పుణ్యం ధర్మ ప్రచారక్ ఆదివాసీల ఐక్యత కు, అభివృద్ధికి కేవలం ఆదివాసి ధార్మిక పునరుద్దరణతోనే సాధ్యం అని నమ్మి ఆదిలాబాద్ నుండి భద్రాద్రి కొత్త గూడెం, చత్తీస్గడ్, తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్, జార్కండ్ , మధ్యప్రదేశ్ లలోని ఆదివాసీ తెగలను ధార్మిక కార్యక్రమాల ద్వారా ఒక్కటి చేస్తున్నామని అన్నారు ఆదివాసీ ఇలవేల్పులు, గుళ్ళను జాతరల పునర్వ్యవస్థీకరణ లో భాగంగా అనేక కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని గుర్తుచేశారు. ముఖ్యంగా 2023 ఫిబ్రవరి నెలలో 124 ఇలవేల్పుల సమ్మేళనం, ఆదివాసి భిన్న తెగలను ఐక్యం చేసిన చిరుమళ్ల సమ్మక్క పుట్టు గద్దెల జాతర చారిత్రక నేపధ్యాన్ని సంతరించుకున్న తీరును, సమ్మక్క పగిడిద్దరాజు ల కళ్యాణం ప్రత్యక్షంగా గమనించానని మంత్రి సీతక్క అన్నారు. ఈ ఆధ్యాత్మిక విషయాన్ని వెంటనే ప్రభుత్వ అధిష్టానం దృష్టికి తీసుకొని త్వరలో ఆదివాసీల మనుగడ, సంక్షేమానికి సంబంధించి తీపి కబురు తీసుకొస్తానని హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ మాజీ ఎంపీ సోయం బాపురావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆదివాసీ మహిళా శక్తి నాయకురాలు ఈక సులోచన మాత పాల్గొన్నారు





# టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఎక్కడా ?

- **టమోటా రైతు... కంట కన్నీరు**
- **టమోటా ధరలు అంతతే... రైతు ఆవేదన..**
- **మరింత దిగజారిన టమోటా ధరలు**
- **2 రూపాయలకే విక్రయం**
- **ఆలూరు, ఆస్పరి దేవనకొండ,పత్తికొండ మండలాల్లో అత్యధికంగా సాగు చేస్తున్న టమోటా పంట**
- **ఇదేనా రైతు ప్రభుత్వం అంటే**
- **ధరల స్థిరీకరణ నిధి ఏమైందని అని ప్రశ్నిస్తున్న రైతులు**
- **ప్రభుత్వమే 15 రూపాయలకు కొనుగోలు చేయాలని కోరుతున్న రైతులు**





**దేవనకొండ :** ఈ సీజన్ ఆరంభంలోనే రాష్ట్రంలోనే కాదు దేశంలోనే ధరలు అదరగొట్టాయి ఎంతగా అంటే గతంలో లేనంతగా కిలో 400 నుంచి 500 వరకు ధర పలికింది ఇక హెూల్సేల్ అంటే మార్కెట్లో 2000 నుంచి 3000 వరకు ధర పలికింది దీంతో సామాన్యులు అరకేజీ కొనలేని పరిస్థితి కొన్ని రోజుల కిందట ఏర్పడింది అయితే ప్రస్తుతం ధరలు తారుమరైపోయాయి టమోటాలకు మార్కెట్లో ధరలు ఎప్పుడు తగ్గుతాయో ఎప్పుడు పెరుగుతాయో తెలియని పరిస్థితి రైతులకు ఏర్పడింది. 20 రోజుల క్రితం 2000 నుంచి 3000 పలికినా 15 కేజీల టమోటా ప్రస్తుతం 40 నుంచి 60కి పడిపోయింది దీంతో టమోటా రైతులు ధరలు లేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు

**టమోటా సాగులో ఆలూరు, ఆస్పరి,దేవనకొండ,పత్తికొండ టాప్**

ఆస్పరి, ఆలూరు దేవనకొండ,పత్తికొండ మండలాల్లో టమోటా పంట అత్యధికంగా పండిస్తున్నారు గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఈ మండల ప్రాంతాలలో సాగు విస్తీర్ణం చాలా తగ్గింది. వర్షాలు లేక పంటలు కూడా అంతంత మాత్రమే ఉన్నాయి. ధరలు చూస్తే గత రెండు నెలల క్రితం 200 నుంచి 300 దాకా పలికిన కేజీ టమోటా ధర ఇప్పుడు ఏకంగా కిలో టమోటా రెండు నుంచి నాలుగు రూపాయలకు పడిపోయింది ఈ ధరలను బట్టి చూస్తే రైతు ఏ విధంగా నష్టపోతున్నాడు అనే విషయం అర్థమవుతుంది. అసలే ధరలు తక్కువగా ఉండటంతో రవాణా ఖర్చు కూలీల ఖర్చు చేతికి అందని స్థితిలో ఉంది.కాపుకు వచ్చిన టమోటా పంటను మార్కెట్కు తీసుకురావడం లేదు. పంట పొలాల వద్దే రోడ్లపై కుప్పలు కుప్పలుగా పారబోస్తున్నారు. ఓవైపు ధరలు లేవని రైతులు ఆవేదన చెందుతుంటే ఒకవేళ పండిన టమోటా పంటను మార్కెట్కు తీసుకువస్తే మధ్య దళారులు ఒక టమోటా గంప పది రూపాయలకు కొంటున్నారు. ఒకవైపు పంటలు లేక మరోవైపు ధరలు లేక రైతు చిన్న భిన్నం అవుతున్నాడు. రైతులను ఆదుకోవడానికి ధరల స్థిరీకరణ నిధి ఏమైందని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతులకు బోనస్ రూపంలో చెల్లించి ఆదుకుంటున్నామని చేప్పిన ప్రభుత్వం ఎటు వెళ్లిందో అని రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు రైతులకు కల్లబొల్లి మాటలు చెప్పి ప్రభుత్వం లోకి వచ్చిందని రాజకీయ పార్టీ నాయకులు విమర్శిస్తున్నారు.ధరలు పెరిగిన సమయంలో ప్రభుత్వమే టమోటా ను కొనుగోలు చేసి కేజీ టమోటా ను 50 రూపాయలకు అమ్మింది. అయితే ధరలు ఉన్నప్పుడు ప్రభుత్వం కొనుగోలు చేయటం ధరలు తగ్గితే రైతులను పట్టించుకోకపోవడం చాలా దారుణం అని విమర్శలు ఉన్నాయి. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పత్తికొండకు వచ్చిన సందర్భంలో ఆక్కడ టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి రైతులను ఆదుకుంటామని చెప్పి ఇప్పటివరకు జ్యూస్ ఫ్యాక్టరీకి సంబంధించిన పనులు ఏమాత్రం కూడా చేపట్టలేదని రైతులు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇది రైతులను మోసం చేయడం తప్ప మరొకటి లేదని రాజకీయ పార్టీ నాయకులు రైతు సంఘాలు విమర్శిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతులను దృష్టిలో ఉంచుకుని కేజీ టమోటా ను 15 రూపాయలకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

**కూలీల ఖర్చు కూడా రావడం లేదు**

**నాయుడు భైరవకుంట రైతు**

ఒక ఎకరంలో టమోటా ను సాగు చేశాను 30 వేల వరకు పెట్టుబడి పెట్టాను ప్రస్తుతం టమోటా కాపుకు వచ్చింది అయితే ధరలు లేకపోవడంతో పూర్తిగా నష్టపోయాను. పండిన టమోటా పంటను మార్కెట్కు తీసుకువస్తే ఇక్కడ ధరలు అంతంత మాత్రమే ఉన్నాయి కూలీలకు రవాణా ఖర్చులకు మాత్రమే సరిపోతున్నాయి మాకు ఏమీ కూడా మిగడం లేదు. చాలా కష్టపడి మార్కెట్ కు వస్తే మా పరిస్థితి ఘోరంగా తయారైంది.

## విదర్భ గౌడ ఆత్మీయ సమ్మేళనంలో మోకుదెబ్బ జాతీయ నాయకులు





**తొలి సమయం డెస్క్ హైదరాబాద్ మర్చి 2** మహారాష్ట్ర నాగపూర్ లోని భరత్ సెలబ్రేషన్ హాల్ లో విదర్భ స్టేట్ గౌడ ఆత్మీయ సమ్మేళనం జరిగింది.ఈ సమ్మేళనం లో గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జాతీయ అధికార ప్రతినిధి తెలంగాణ హైకోర్ట్ న్యాయవాది బాలసాని సురేష్ గౌడ్, జాతీయ గౌరవ సలహా దారులు మాజీ జిల్లా న్యాయ మూర్తి వర్ధ బలరాం గౌడ్, జాతీయ నాయకులు మహారాష్ట్ర ఇంచార్జి, కదిరే ఆంజనేయులు గౌడ్, విదర్భ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల మల్లేశం గౌడ్, తదితరులు పాల్గొని ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జాతీయ అధికార ప్రతినిధి, జాతీయ సలహాదారులు బాలసాని సురేష్ గౌడ్, వర్ధ బలరాం గౌడ్ లను ఎర్రోళ్ల మల్లేశం గౌడ్ సన్మానించి ఆత్మీయ సన్మానం చేయడం జరిగింది.

## తెలంగాణ కాంగ్రెస్‌లో బాబు కోవర్టులు

**మెల్లగా ఏకమవుతున్న ఆనాటి టిడిపి శ్రేణులు**

**బాబు కనుసన్నల్లో రేవంత్ కార్యాచరణ**

**హైదరాబాద్:** తెలుగుదేశం మాజీలంతా ఏకమవు తున్నారు. తెలంగాణ ఏర్పాటు తరవాత టిడిపిలో ఉండి.. చెల్లాచెదురైన వారంతా మళ్లీ గళం విప్పుతున్నారు. చంద్రబాబు అరెస్ట్తో తెలుగుదేశం అభిమానుల ఓట్లను పట్టుకునే వేటలో పిసిసి చీఫ్ రేవంత్ పడ్డారు. ఇందులో భాగంగానే బాబు అరెస్ట్ను ఆయన ఖండించారు. మోత్కుపల్లి నర్సింహుల కూడా ఒకరోజు దీక్ష చేశారు. తుమ్మల నాగేశ్వరరావు, మైనంపల్లి హన్మంతరావు లాంటి మాజీ టిడిపి లంతా కాంగ్రెస్లో చేరుతున్నారు. ఇదంతా ఓ పద్దతి ప్రకారం సాగుతోంది. తెలుగుదేశం సానుభూతిపరుల ఓట్లను గంపగుత్తగా లాక్కోవడమే వీరి లక్ష్యంగా ఉంది. ఈ క్రమంలో తెలంగాణకు వ్యతిరేకంగా అప్పట్లో చంద్రబాబు చేసిన విన్యాసాలు గమనించడం లేదు. స్వయంగా నాటి స్పీకర్ యనమల రామకృష్ణుడు తెలంగాణ పదం నిషేధించారు. ఇలాంటి వారి అనుచరులంతా ఇప్పుడు మళ్లీ గళం విప్పుతున్నారు. తెలంగాణ పదమే నిషేధించిన చంద్రబాబు కోసం నిరసనలు చెప్పడంపై తెలంగాణలో ఇప్పుడు చర్చగా మారింది. చంద్రబాబు నాయుడు అరెస్ట్ పై తెలంగాణలో నిరసనలు చేస్తే తప్పేంటన్న సవాళ్లు విసరుతున్నారు. ఆయన ఉమ్మడి ఎపిలో 9 ఏళ్లు సిఎంగా చేశారని వాదిస్తున్న వారూ ఉన్నారు. ఈ వ్యాఖ్యలు టీడీపీ నాయకులో, ఆంధ్రా పౌరులో, చంద్రబాబు అభిమానులో చేస్తే తప్పు పట్టాల్సిన అవసరం లేదు. కానీ, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కూడా దీనిని సమర్థిస్తున్నారు. ఆయన చంద్రబాబు అనుంగు శిష్యుడు మాత్రమే కాదు..చంద్రబాబు ఆశిస్సులతోనే కాంగ్రెస్లో చేరి అధ్యక్షుడయ్యాడని ప్రచారం కూడా ఉంది. నిజానికి తెలంగాణ విధ్వంసంలో చంద్రబాబు చేయాల్సిందంతా చేశారు. తెలంగాణలో ఒక్కొక్కటిగా పరిశ్రమలను మూసేసారు. ఆంధ్రా యజమానలుకు భూములు కట్టబెట్టారు. నిజాం షుగర్స్ భూములను అప్పనంగా రాజులకు కట్టబెట్టారు. కార్మికులు నిరసనలు కూడా తెలుపకుండా నిషేదాజ్ఞలు విధించి, తెలంగాణ వ్యతిరేకతను చాటుకున్నారు. అలాంటి చంద్రబాబు నాయుడు ఇప్పుడు కాంగ్రెస్ ద్వారా మళ్లీ పునరుజ్జీవం పొందేలా ప్లాన్ చేస్తున్నారన్న అనుమానాలు కలుగుతున్నాయి. మద్దతుగా రేవంత్ రెడ్డి మాట్లాడటం తెలంగాణ సమాజాన్ని, ఉద్యమకారులను అవమానించడమేనని బిఆర్ఎస్ శ్రేణుల నుంచి విమర్శలు రావడం సమజమే. నిరసన తెలపడం అటుంచి, అసెంబ్లీలో కనీసం తెలంగాణ శబ్దం కూడా వినపడ కూడదని నిషేధించిన వ్యక్తికి తెలంగాణ నేల మీద నిరసన ప్రకటించే అధికారం ఇవ్వాలని వాదించడం రాజును మించిన రాజభక్తిని రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడి హోదాలో ఆయన రాజకీయ ఎత్తుగడలు అంతా ఓటల వేటకోసమే అని వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. తెలంగాణలో కాంగ్రెస్ ను అధికారంలోకి తెచ్చేందుకు కాంగ్రెస్ హైకమాండ్ ఓవైపు, సీనియర్లు మరోవైపు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. రేవంత్ మరో రకంగా నరుక్కు వస్తున్నారు. టిడిపి శ్రేణులను ఏకం చేసి లబ్ది పొందాలన్న వ్యూహం అందులో దాగివుంది. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ గెలుపొందడం కోసం టిడిపి శ్రేణుల మద్దతు పొందాలన్న వ్యూహం దాగివుంది. టీడీపీని రేవంత్ వీడినప్పటికీ చంద్రబాబు నాయుడుకే ఆయన వీర విధేయుడి అని ఎవరిని అడిగినా చెబుతారు. 'ఓటు కు నోటు' కేసులో ముద్దాయి అయిన రేవంత్ కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నేతల్లో తెలంగాణపై ఆశలు చిగురించాయి. తెలంగాణలో మారిన రాజకీయ పరిస్థితుల కారణంగా కాంగ్రెస్ కు కొంత అనుకూల పవనాలు వీస్తున్నాయి. అధికార పార్టీపై వ్యతిరేకత కావచ్చు, తెలంగాణ ఇచ్చిన పార్టీకి ఓసారి అవకాశం ఇద్దామనే భావన కావచ్చు. క్రమంగా కాంగ్రెస్ వైపు సమీకృతం అవుతున్నారు. జూనియర్, సీనియర్ నేతలంతా గాంధీభవన్ కు క్యూ కడుతున్నారు. వరుసగా కండువాలు కప్పుకుంటున్న నేతలతో చాలా కాలం తర్వాత గాంధీభవన్ కళకళలాడుతూ ఉన్నది. ఈసారి ఎలాగైనా కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకురావాలనే పట్టుదల అసలైన హస్తం నేతల్లో బలంగా కనిపిస్తోంది. ఈ క్రమంలో ఇప్పుడిప్పుడే కాంగ్రెస్ దిక్కు చూస్తున్న తెలంగాణ ఉద్యమకారులు రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో మళ్లీ పునరాలోచనలో పడుతున్నారు.

# స్ఫూర్తి ప్రదాత స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాద రావు

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**తొలి సమయంబీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 2**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభకు వన్నె తెచ్చిన మాజీ స్పీకర్, స్వర్గీయ నేత దుద్దిళ్ళ శ్రీపాదరావు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ఆయన జయంతి సందర్భంగా ఆదివారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశం మందిరం లో ఏర్పాటు చేసిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ తో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ%ూ% స్వర్గీయ శ్రీపాద రావు న్యాయవాదిగా ప్రజలకు మంచి సేవలు అందించారని, ఆయన రాజకీయ ప్రస్థానంలో మొదటిగా సర్పంచ్ గా రెండు సార్లు ఎన్నికై తదుపరి మహాదేవపూర్ సమితి అధ్యక్షుడిగా ఎన్నికైయ్యారని చెప్పారు. 1984 ఎన్నికల్లో మొదటి సారి మంథని నుంచి శాసన సభ్యులుగా పోటీ చేసి విజయం సాధించి 3 సార్లు శాసన సభ్యునిగా ఎన్నికైనట్లు తెలిపారు. 1994 లో ఓటమి పాలు అయినప్పటికీ ప్రజల మధ్యనే ఉంటూ ఎన్నో సేవలు అందించడం అలాగే 1999 ఏప్రిల్ 13న మహదేవపూర్ మండలం అన్నారంకు తన అనుచర వర్గంతో వెళ్లి వస్తున్న క్రమంలో మార్గమధ్యంలోని అడవుల్లో ఆయన వాహనాన్ని నక్సల్స్ ఆపివేసి, ఆయనతో మాట్లాడాలని చెప్పి లోపలికి తీసుకెళ్లి కరుకు తుపాకీ తూటాలతో విగత జీవున్ని చేశారు. ఆయన మరణించిన... ఇప్పటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు అని కలెక్టర్ అన్నారు. అధికారులు మహనీయుని గురించి కింది స్థాయి సిబ్బందికి కూడా తెలపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఓ సంజీవరావు, బీసీ సంక్షేమ అధికారి ఇందిరా, జిల్లా క్రీడా శాఖ అధికారి పరంధామ రెడ్డి, డిఎం సివిల్ సప్లైస్ త్రినాధ్ బాబు , మైనింగ్ శాఖ అధికారి దినేష్ మరియు వివిధ శాఖల అధికారులు, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# విలేకరి యాకుబ్ జ్యూస్ స్టాల్ ప్రారంభించిన ఎస్సై రమణా రెడ్డి



**తొలి సమయం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 2**
లక్ష్మీదేవిపల్లి మండలం లక్ష్మీదేవిపల్లి యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి కొరకు నూతన వ్యాపారాలు ప్రారంభించడం శుభ పరిణామమని లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని సంజయ్ నగర్ పరిధిలో గల జాతీయ రహదారిపై విలేకరి యాకుబ్ పాషా(బడే)స్వశక్తితో ఏర్పాటు చేసుకున్న జ్యూస్ స్టాల్ ను ప్రారంభించి,వ్యాపారం దిన దినాభివృద్ధి సాధించి మంచి లాభాలు రావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో లక్ష్మీదేవిపల్లి మండల యూత్ ప్రెసిడెంట్ జాలరపు ఈశ్వర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కపల్లి ప్రసాద్, బిల్లా, తాహెర్, సజ్జు, ఇమ్రాన్, విజయ్, మతిన్, ఆదాబ్ హైదరాబాద్ విలేఖరి శ్రీను, మెట్రో రాందాస్, డీసీఎం రమేష్, బొమ్మసాని సర్వేశ్వరరావు, దిల్లు, తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనదారుడికి హెల్మెట్ తప్పనిసరి

## అశ్వాపురం ఎస్ఐ తిరుపతిరావు



**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 2**
అశ్వాపురం: రోడ్డు ప్రయాణం చేసే వాహనదారులు సరైన వాహన పత్రాలు కలిగి ఉండాలని అశ్వాపురం ఎస్ఐ తిరుపతిరావు అన్నారు. స్థానిక మండల కేంద్రంలోని ఓం శక్తి దేవాలయం వద్ద ఆదివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్‌ను ధరించాలని, హెల్మెట్ లేని వారికి ఫైన్ విధిస్తూ హెల్మెట్ అవసరాన్ని గురించి అవగాహన కల్పించారు. వాహనాలను నిర్ణీత వేగంతో నడపాలని తెలిపారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ తప్పకుండా కలిగి ఉండాలని అన్నారు. వాహనాలపై ఉన్న పెండింగ్ చలానాలను చెల్లించాలని వాహనదారులకు సూచించారు.. నిబంధనలను పాటించకపోతే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు.

# అసంఘటిత కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి.. !

## ఎం బి నర్సారెడ్డి సిఐటియు పట్టణ కన్వీనర్



**తొలి సమయం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 2**
భద్రాచలం అసంఘటిత కార్మికులందరికీ కనీస వేతన చట్ట ప్రకారం 26వేల రూపాయలు ఇవ్వాలని సిఐటియు భద్రాచలం పట్టణ కన్వీనర్ ఎంబి నర్సారెడ్డి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆదివారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిఐటియు తలపెట్టిన కరపత్ర ప్రచార క్యాంపియన్ ను పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్మిక వ్యతిరేక ప్రభుత్వంగా నిలిచిందని ఆరోపించారు. బ్రిటిష్ కాలం నాటి నుండి ఎన్నో వందల మంది కార్మికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి సాధించుకున్న హక్కులను చట్టాలను మోది సర్కార్ కాల రాయాలని చూస్తుందని అందులో భాగంగానే కార్మిక చట్టాల స్థానంలో కోడ్ లను తీసుకువచ్చి కార్మికులకు కనీస హక్కులను కూడా లేకుండా చేస్తుందని ఆరోపించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ బాటలోనే రాష్ట్ర ప్రభుత్వం సైతం పయనిస్తూ ఎన్నికల ముందు కార్మికుల దీక్ష శిబిరాల వద్ద అనేక హామీలు గుప్పించిన రేవంత్ సర్కార్ అధికారం చేపట్టాక వాటిని విస్మరించి కార్మికుల ఆగ్రహానికి గురవుతుందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక సంఘాలన్నీ ఒకతాటిపై కొచ్చి ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని మహాకవి శ్రీశ్రీ చెప్పినట్టుగా పోరాడితే పోయేది ఏమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అన్న నినాదాలు ప్రతి కార్మికుడు స్మరించుకుంటూ ఉద్యమ బాట లో పయనించాలని కోరారు. ఈనెల 1వ తేదీ నుండి ఏడో తేదీ వరకు సిఐటియు ఆధ్వర్యంలో అన్ని కార్మిక కూడళ్ళ వద్ద కరపత్రం ద్వారా ప్రచార క్యాంపియన్ నిర్వహిస్తున్నామని అనంతరం పోరాటాలను రూపొందిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను వీడి కార్మిక హక్కులను కాపాడేందుకు కృషి చేయకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు అప్పారి రాము అనుకోరు మధుసూదన్ రమాదేవి మమత రమేష్ జాకి వేణు తదితరులు పాల్గొన్నారు.

# చీకటి కార్తీక్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా జక్కిడి శివచరణ్ రెడ్డి జన్మదిన వేడుకలు



**తొలిసమయం, కొత్తగూడెం మార్చి 02 :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీకటి కార్తీక్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలతో పాటు, పలు చోట్ల కేక్ కటింగ్, సామాజిక సేవా కార్యక్రమాలు చేశారు. జిల్లా కేంద్రం కొత్తగూడెం విద్యానగర్ లోని రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొన్న చీకటి కార్తీక్ యూత్ నాయకులు, చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా చీకటి కార్తీక్ మాట్లాడుతు జక్కిడి ఛారిటబుల్ ట్రస్ట్ స్థాపన ద్వారా విద్య, ఆరోగ్య సంరక్షణ, సమాజ అభివృద్ధి అంటూ పలు సామాజిక సేవలు చేస్తు %చీూఖ×% లో తన ప్రయాణం మొదలుపెట్టి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఎదిగే క్రమంలో తన తండ్రి జక్కిడి ప్రభాకర్ రెడ్డి వారసుడిగా ఎంత ఎదిగిన ఒదిగి ఉండాలి, నమ్ముకున్న వారికి అండగా ఉండాలన్న సిద్ధాంతంతో నేడు తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నిలిచిన తీరు యువతకు ఆదర్శమన్నారు. రాబోయే రోజుల్లో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరాలని, జిల్లాలో పార్టీ పటిష్టత కోసం యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేస్తామన్నారు. ఈ వేడుకల్లో పాల సత్యనారాయణ రెడ్డి, గులాం మతిన్, కల్లూరి సంపత్, తాటి పవన్, జల్లారపు ఈశ్వర్, రామ్మూర్తి, వీణ రెడ్డి, శ్రీకాంత్, మాలోత్ శివ, ప్రణయ్, సాయి, జీడి సందీప్ సాగర్ మౌనిష్, టిల్లు, పాల్గొన్నారు.

# ఆన్లైన్ షాపింగ్‌లో మోసం

## ఫ్లిప్కార్ట్ మోసం ఆర్డర్ చేస్తే చిన్న చిన్న కవర్లలో పేపర్ పెట్టి పంపారు





**తొలి సమయం:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 2**
సుజాతనగర్ మండలం: సుజాతనగర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఫిబ్రవరి 25 తారీఖు నాడు ఫ్లిప్కార్ట్ ఆన్లైన్లో షాపింగ్ చేశాడు ఇయర్ బర్డ్స్ చెవి దగ్గర పెట్టుకొని సెల్ ఫోన్ ద్వారా, మాటలు, పాటలు వినడానికి ఆన్లైన్ షాపింగ్ ద్వారా ఆర్డర్ చేశాడు మార్చి 02 న ఉదయం సుమారు11 గంటల ప్రాంతంలో ఫ్లిప్కార్ట్ డెలివరీ బాయ్ ఆన్లైన్ కవర్ను అందించాడు అతనికి డబ్బులు ఇచ్చి వస్తువును ఇంట్లోకెళ్లి విప్పి చూడగా తీసుకున్న వ్యక్తి ఆన్లైన్ ఆర్డర్ చేసి మోసపోయానని అర్థమైంది ఇయర్ బర్డ్స్ వచ్చాయని అనుకున్న ఆ వ్యక్తి కవర్ ఓపెన్ చేయగా అందులో చిన్న చిన్న కవర్ ప్యాకెట్లు పెట్టి వాటిల్లో చిన్న చిన్న పేపర్ ముక్కల తోటి ఉండటం చూసి ఫ్లిప్కార్ట్ కంపెనీ మోసం చేసిందని తెలుసుకున్నాడు ఈ విషయం డెలివరీ బాయ్ కి చెప్పగా మా వంతుగా మీ వస్తువును మీ చేతికి అందించటమే గాని మాకు ఎటువంటి సంబంధం లేదు అని సమాధానం ఇవ్వడంతో వినియోగదారుడు ఆందోళన చెందాల్సిన పరిస్థితి తను పెట్టిన ఆర్డర్ క్షుణ్ణంగా పరిశీలించగా తిరిగి ఇవ్వడానికి అవకాశం లేదు అని ఫ్లిప్కార్ట్ యాప్ లో చూపెట్టడంతో తన డబ్బులు పోగొట్టుకున్నానని తెలుసుకున్నాడు ఎంతో పేరు పొందిన పెద్ద పెద్ద కంపెనీలు ద్వారా నడిపిస్తున్నటువంటి ఫ్లిప్కార్ట్ యాప్ ఇలా మోసాలు చేయడంపై ఇటువంటి సంఘటన జరిగిన ప్రతి ఒక్కరూ మండిపడుతున్న పరిస్థితి ఈ సమస్యను వినియోగదారుడుకి ప్రతి ఒక్కరికి ఏం చేయాలో తెలియదు కాబట్టి సంబంధిత అధికారులు ఈ మోసాలపై తగు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101